చందాల పేరుతో కమిటీల దందా

- అడిగినంత ఇవ్వాలని హుకుం
- ప్రజాప్రతినిధుల కాలనీల్లో మితిమీరుతున్న ఆగడాలు
- యజమాని నుంచి రూ.10 వేలు.. అద్దెదారు వద్ద రూ.5 వేలు వసూలు
- వినాయక ఉత్సవ కమిటీల తీరుపై హిందూ సంఘాల అసహనం

హన్మకొండ అర్బన్: వినాయక చవితి వస్తోంది. అత్యంత భక్తిశ్రద్ధలతో గ్రామాలు, పట్టణాలు, నగరాల్లో ఐకమత్యంతో నిర్వహించే ధార్మిక కార్యక్రమాల్లో ఈ వేడుక అత్యంత ముఖ్యమైంది. పెద్దలు, ప్రముఖులు, వ్యాపారస్తులు, తమకు తోచినంత డబ్బులు పోగుచేసుకొని ఉత్సవాలను నిర్వహించడం అనాదిగా వస్తున్న ఆనవాయితీ. ఈ క్రమంలో డబ్బులు ఇవ్వలేని వారు తమకు తోచిన విధంగా బియ్యం, ఇతర పూజా సామగ్రి, షామియానాలు, లైట్లు వంటివి సమకూరుస్తుంటారు. మరికొందరు స్వచ్ఛందంగా సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. ఇంకొందరు అన్నదాన కార్యక్రమాలకు తమ వంతుగా విరాళాలు ఇస్తుంటారు. మొక్కుబడులు ఉన్న వాళ్లు విగ్రహాలు ఏర్పాటు చేసి కార్యక్రమాల ఖర్చులు భరిస్తుంటారు. ఇలా ఎవరికి వారు స్వచ్ఛందంగా చేసేదే గణేశ్ నవరాత్రి సంబురాలు. అయితే, ఇటీవల ఈ పద్ధతులు కొత్త పుంతలు తొక్కడం ప్రజలు, భక్తులను ఆవేదనకు గురిచేస్తున్నాయి.

కమిటీల పేరుతో వసూళ్ల దందా

నగరంలో వినాయక నవరాత్రి ఉత్సవాల నిర్వాహణ కోసం ఉత్సవ కమిటీలు ఏర్పాటు చేస్తుండడం పరిపాటి. అయితే కొన్ని ప్రాంతాల్లో ఈ కమిటీల ఆగడాలు శ్రుతిమించడం భక్తులను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తోంది. ఉమ్మడి వరంగల్ జిల్లాకు సంబంధించి ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, మాజీ మంత్రులు, స్థానిక ఎమ్మెల్యేలు, ఇతర ప్రజాప్రతినిధులు ఉన్న కాలనీల్లో కొన్నిచోట్ల ఉత్సవ కమిటీ సభ్యులు స్థానికులను తీవ్రంగా వేధిస్తున్నట్లు ఆరోపణలు వస్తున్నాయి. సహజంగా ప్రజాప్రతినిధులు ఉన్న కాలనీల్లోని ప్రజలు తమ కాలనీకి రోడ్లు, డ్రెయినేజీలు, మౌలిక సదుపాయాలు సమకూరుతాయని ఆశించడం సహజం. ఉత్సవాలు వంటివి జరిగినప్పుడు సదరు ప్రజాప్రతినిధులే ఆర్థిక భారం భరిస్తారని ధీమాగా ఉంటారు. అయితే, ప్రస్తుతం అందుకు విరుద్ధంగా ఉత్సవ నిర్వాహక కమిటీలు.. ప్రజాప్రతినిధులు ఉండే కాలనీల్లో ప్రవర్తిస్తుండడం స్థానికులను మనోవేదనకు గురి చేస్తోంది.



ఓ భక్తుడు ఫోన్‌పే ద్వారా సమర్పించిన విరాళం

యజమాని రూ.10 వేలు.. కిరాయిదారు రూ.5 వేలు

ప్రస్తుతం వినాయక చవితి సమీపిస్తుండడంతో ఉత్సవ నిర్వాహక కమిటీలు కొన్ని తమ ప్రతాపాన్ని చూపుతున్నాయి. నగరంలోని కొన్ని కాలనీల్లో ప్రజాప్రతినిధులు ఉన్నందున కార్యక్రమాన్ని మరింత ఘనంగా నిర్వహించాలంటూ నిర్వాహకులు ప్రగల్భాలకు పోతున్నారు. ప్రతీ ఇంటికి వెళ్లి ఇంటి యజమాని రూ.10,116, అద్దెకు ఉండేవాళ్ల నుంచి రూ.5,116 ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. ముందుగానే వారి పేరుతో రసీదు రాసి చేతిలో పెట్టి డబ్బులు ఇవ్వాలని హుకుం జారీ చేస్తున్నారు. ఈ విధంగా చేస్తున్న ఉత్సవ నిర్వాహకుల తీరుపై ఆయా కాలనీల్లో ప్రజలు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు.

డిమాండ్ చేయడం సరికాదు

హిందూ సమాజం ఐక్యత కోసం నిర్వహించే ఇలాంటి ఉత్సవాలు, వేడుకల్లో నిర్వాహక కమిటీలు భక్తులను ఇబ్బందులకు గురి చేయడం సరికాదు. కొన్నిచోట్ల ఇలా జరుగుతున్న విషయం తమ దృష్టికి వచ్చింది. ఈ విషయంపై వారితో చర్చిస్తాం. ఇబ్బంది కలగకుండా చూస్తాం. భక్తితో ఇచ్చేది స్వీకరించి అందుకు తగ్గట్లుగా ఉత్సవాలు నిర్వహించాలి. ఉత్సవ నిర్వాహక కమిటీలు ఈ విషయాన్ని గుర్తించాలి. డబ్బులు అధికంగా డిమాండ్ చేయడం వల్ల ప్రజల్లో తప్పుడు సంకేతాలు వెళ్తాయి. ప్రజలను ఇబ్బందులకు గురిచేయకుండా కార్యక్రమాల నిర్వహణకు ఉత్సవ కమిటీలు కృషి చేయాలి.

\- ఉదయ్ కుమార్, వీహెచ్‌పీ ప్రతినిధి

క్లుప్తంగా

రేపు వాహనాల వేలం

కాజీపేట అర్బన్: హనుమకొండ ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో అక్రమంగా నాటుసారా రవాణా చేస్తూ పట్టుబడిన రెండు టీవీఎస్ ఎక్సెల్, హీరో హోండా ప్రో వాహనాలకు ఈనెల 25వ తేదీన వేలంపాట నిర్వహించనున్నట్లు హనుమకొండ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ దుర్గాభవాని శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల వారు 50 శాతం ధరావత్తు చెల్లించి వేలంలో పాల్గొనాలని పేర్కొన్నారు.

ధర్నాను విజయవంతం చేయాలి

కాజీపేట: కాజీపేట మున్సిపల్ సర్కిల్ కార్యాలయం ఎదుట సోమవారం జరగనున్న ధర్నాను విజయవంతం చేయాలని సీపీఎం నాయకులు కోరారు. ఈమేరకు పార్టీ మండల కార్యదర్శి ఓరుగంటి సాంబయ్య ఆధ్వర్యంలో విలీన గ్రామాల్లో కరపత్రాలు పంపిణీ చేస్తూ శనివారం ప్రచారం నిర్వహించారు.

కాంగ్రెస్ మహిళా కార్యవర్గం



కాజీపేట: కాంగ్రెస్ పార్టీ 62వ డివిజన్ మహిళా అధ్యక్షురాలిగా కుమ్మరి నీలక్క, ఉపాధ్యక్షురాలిగా కస్‌రాజ్ స్వరూప, సంయుక్త కార్యదర్శిగా రజియా, ప్రధాన కార్యదర్శిగా కల్వాల విజయ నియమితులయ్యారు. ఈ మేరకు వారికి నియామక పత్రాలు అందజేసి కార్పొరేటర్ జక్కుల రవీందర్ యాదవ్, నాయకులు శనివారం సన్మానించారు.

ఓబీసీ సెల్ నియోజకవర్గ వైస్ చైర్మన్‌గా కుమారస్వామి



మడికొండ: కాంగ్రెస్ వర్ధన్నపేట నియోజకవర్గ ఓబీసీ సెల్ నియోజకవర్గ వైస్ చైర్మన్‌గా మడికొండ గ్రామానికి చెందిన నార్లగిరి కుమారస్వామి నియమితులయ్యారు. ఈమేరకు ఆయనకు నియామక పత్రాన్ని మంత్రి వడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శనివారం అందజేశారు.

అభాగ్యులకు అన్నదానం



కాజీపేట: ఉమ నిర్మాణ సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు గండికోట సంపత్ కాజీపేట పట్టణంలో శనివారం రాత్రి ఉచిత అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. ప్రత్యేక వాహనంలో భోజనాలను తీసుకొచ్చి అభాగ్యులు, అనాథలు, ప్రయాణికులు, బాటసారులకు పంపిణీ చేశారు. కాజీపేటలో మండల రోజులు (41) అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహించాలని తీర్మానించి, అందుకనుగుణంగా భోజన ఏర్పాట్లు చేస్తున్నట్లు సంపత్ తెలిపారు. కార్యక్రమంలో కంది శ్రీనివాస్, దువ్వ కనక రాజ్, కమల్ కుమార్ పాల్గొన్నారు.

అథ్లెటిక్స్‌లో వరుణ్ ప్రతిభ



కాజీపేట అర్బన్: కాజీపేట మండలం కడిపికొండలోని మైనార్టీ గురుకుల పాఠశాలకు చెందిన 8వ తరగతి విద్యార్థి వరుణ్.. హనుమకొండ జేఎన్‌ఎస్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి అథ్లెటిక్స్ చాంపియన్ పోటీల్లో ప్రతిభ కనబరిచి సిల్వర్ మెడల్ సాధించాడు. ఈ మేరకు గురుకుల పాఠశాల ఆవరణలో శనివారం ఏర్పాటు చేసిన అభినందన సభలో వరుణ్‌ను పాఠశాల ప్రిన్సిపాల్ తనుగుల శ్రీనివాస్, పీఈటీ సోమనర్సయ్య, ఉపాధ్యాయులు, తదితరులు అభినందించారు.

జీవశాస్త్ర పుస్తకం ఆవిష్కరణ



విద్యారణ్యపురి: ఉపాధ్యాయ నియామక పోటీ పరీక్షలు రాసే అభ్యర్థులకు ఉపయోగపడే, హనుమకొండకు చెందిన అధ్యాపకులు డాక్టర్ సుతారి సతీష్, డాక్టర్ ఓంకార్, డాక్టర్ పార్వతి రచించిన జీవశాస్త్ర పుస్తకాన్ని హనుమకొండ డీఈఓ కార్యాలయంలో డీఈఓ వాసంతి శనివారం ఆవిష్కరించారు. కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి శ్రీనివాసస్వామి, హసన్‌పర్తి మండల విద్యాశాఖాధికారి శ్రీనివాస్, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మంద తిరుపతిరెడ్డి, పుస్తక రచయితలు పాల్గొన్నారు.

యూరియా లోడింగ్ ఇవ్వాలి

ఖిలా వరంగల్: వరంగల్ గూడ్స్ షెడ్‌కు చేరిన ఇఫ్కో యూరియా ఎగుమతి చేసేందుకు లారీ యజమానులకు లోడింగ్ ఇవ్వాలని వరంగల్ జిల్లా లారీ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు వేముల భూపాల్ డిమాండ్ చేశారు. ఈ మేరకు వరంగల్ ఏనుమాముల లారీ పార్కింగ్ స్థలంలో శనివారం సాయంత్రం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. లారీ ఓనర్ల సమస్యలు పరిష్కరించాలని కలెక్టర్, ఆర్టీఓ, ఫర్టిలైజర్ కాంట్రాక్టర్‌కు వినతిపత్రాలు అందజేసినట్లు భూపాల్ తెలిపారు.

ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలి

- మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్

మడికొండ: గణపతి నవరాత్రోత్సవాలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని మడికొండ ఇన్‌స్పెక్టర్ పులాల కిషన్ సూచించారు. మడికొండ పోలీసు స్టేషన్ పరిధిలోని గణపతి మండపాల నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నిర్వాహకులు ముందుగా పోలీసుల అనుమతి పొందాలని సూచించారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న అనంతరం పోలీసు అధికారులు ఆన్‌లైన్ ద్వారా అనుమతులు జారీ చేస్తారని తెలిపారు. మండపాల వద్ద మద్యపానం, జూదం, అసాంఘిక కలాపాలకు పాల్పడితే చట్టప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఎస్సైలు రాజ్‌కుమార్, రాంమోహన్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.


మడికొండ: మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్ కిషన్

మండపాలకు అనుమతులు తీసుకోవాలి

మామునూరు: గణేశ్ మండపాలకు తప్పనిసరిగా అనుమతులు తీసుకోవాలని మామునూరు ఇన్‌స్పెక్టర్ రమేష్ సూచించారు. మామునూరు పోలీస్ స్టేషన్ ప్రాంగణంలో ఎస్సైలు శ్రీకాంత్, కృష్ణవేణి ఆధ్వర్యంలో డీజే సౌండ్స్, మండప నిర్వాహకులతో శనివారం సమావేశం నిర్వహించారు.

వైభవంగా గణేశ్ ఆగమన యాత్ర


గణేశ్ ఆగమన యాత్రలో ఎమ్మెల్యే రాజేందర్ రెడ్డి

నయీంనగర్: గ్రేటర్ వరంగల్లో అప్పుడే వినాయక చవితి సందడి మొదలైంది. హనుమకొండ పబ్లిక్ గార్డెన్ నుంచి జాగృతి లోటస్ కాలనీ వినాయకుడి ఆగమన యాత్రను వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి శనివారం ప్రారంభించారు. కార్యక్రమంలో ఉత్సవ కమిటీ అధ్యక్షుడు విజయ్‌కుమార్, కార్యదర్శి బింగి సతీష్, జాగృతి లోటస్ కాలనీ అధ్యక్షుడు నల్ల సత్యనారాయణ, రాజా మల్లారెడ్డి, రమణా రెడ్డి, మాధవ రెడ్డి పాల్గొన్నారు.

హన్మకొండ కల్చరల్: హనుమకొండ బీఈడీ కళాశాల ఎదురుగా ఉన్న వరసిద్ధి గజానన మండలి మండపం ఆధ్వర్యంలో వేయిస్తంభాల దేవాలయ ప్రాంగణం నుంచి గణపతి ఆగమన్ యాత్ర శనివారం రాత్రి ప్రారంభమైంది. కార్యక్రమంలో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డి, తెలంగాణ అర్చక సమాఖ్య రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ గంగు ఉపేంద్రశర్మ, కార్పొరేటర్ పోతుల శ్రీమాన్, గజానన మండలి సభ్యులు పాల్గొన్నారు.

కాజీపేట: కాజీపేట పట్టణంలో శనివారం రాత్రి గణేష్ ఆగమన్ శోభయాత్రను బీజేపీ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్ రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ ప్రారంభించారు. రహమత్‌నగర్ వర్తక వ్యాపార ఉత్సవ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఊరేగింపు కార్యక్రమంలో మేకల శ్రావణ్ కుమార్, భగవాన్ దాస్ ఉపాధ్యాయ, దువ్వ నవీన్ తదితరులు పాల్గొన్నారు.

అమెరికా వస్తువులను బహిష్కరిద్దాం


ర్యాలీలో పాల్గొన్న స్థానికులు, వ్యాపారులు

హన్మకొండ చౌరస్తా: అమెరికన్ వస్తువులను బహిష్కరించి, స్వదేశీ వస్తువులను వినియోగించినప్పుడే ట్రంప్ టారిఫ్‌లకు చెక్ పెట్టొచ్చని బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు జలందర్‌రెడ్డి అభిప్రాయపడ్డారు. ఈ మేరకు స్వదేశీ జాగరణ మంచ్ ఆధ్వర్యంలో ములుగు రోడ్డు జంక్షన్ నుంచి హనుమకొండ చౌరస్తాలోని శివశక్తి స్థల్ వరకు శనివారం ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో న్యాయవాద పరిషత్ నాయకుడు రామకృష్ణ, స్వదేశీ జాగరణ మంచ్ బాధ్యుడు శ్రీనివాసరెడ్డి, విభాగ్ సంయోజక్ ఉదయ్, రఘుపతిరెడ్డి, వెంకటేశ్వర్లు, శరత్, చంద్ర, సుజిత్, కార్తీక్, రమణారెడ్డి, మధు, రిత్విక్, మురళి, దయాసాగర్, సంతోష్ తదితరులు పాల్గొన్నారు.

ఎన్‌సీసీలో చేరితే ఉజ్వల భవిష్యత్

న్యూశాయంపేట: విద్యార్థులు ఎన్‌సీసీ కోర్సుల్లో చేరితే ఉజ్వల భవిష్యత్ ఉంటుందని సీకేఎం కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ ధర్మారెడ్డి అన్నారు. కళాశాల ఎన్‌సీసీ ఆర్మీ పదో బెటాలియన్ ఆధ్వర్యంలో ఎన్‌సీసీ ఎంపికలను శనివారం నిర్వహించారు. సందర్భంగా విద్యార్థుల ఎత్తు, బరువు, రన్నింగ్, సిట్ అప్స్, పుష్‌అప్స్, మెడికల్ పరీక్షలతో పాటు రాత పరీక్షలు నిర్వహించి ఎంపిక చేశారు. కార్యక్రమంలో కల్నల్ ఎస్ఎస్ రామదురై, కెప్టెన్ డాక్టర్ పూజారి సతీష్ కుమార్, డాక్టర్ అయేషా, డాక్టర్ జైపాల్ రెడ్డి, మమత, సుమన్, సూపరిండెంట్ శ్రీనివాస్, శేషనారాయణ, కమలాకర్, సీనియర్ కేడెట్లు తాజొద్దీన్, టోనీ, ప్రణయ్, నందిని, తేజోమయి, అక్షయ, హస్మ పాల్గొన్నారు.


ఎంపిక ప్రక్రియ నిర్వహిస్తున్న అధికారులు

ఔషధ విద్యకు కేంద్రంగా వరంగల్


రామచంద్రంను సత్కరిస్తున్న కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం, ఫార్మసీ వైద్యులు

ఖిలా వరంగల్: ఔషధ విద్యకు ప్రముఖ కేంద్రంగా వరంగల్ కాకతీయ విశ్వవిద్యాలయం అవతరించిందని కేయూ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ రామచంద్రం అన్నారు. వరంగల్ ఉర్సు గుట్ట తాళ్ల పద్మావతి ఫార్మసీ కళాశాల ప్రాంగణంలో కళాశాల చైర్మన్ తాళ్ల మల్లేశం ఆధ్వర్యంలో కేయూ బీఫార్మసీ 24, 25వ, ఫార్మడీ 11, 12వ, జేఎన్‌టీయూ బీఫార్మసీ 14, 15వ విద్యార్థుల స్నాతకోత్సవం శనివారం జరిగింది. ముఖ్యఅతిథులుగా కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం, కేయూ కంట్రోలర్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్‌చార్జ్ ప్రొఫెసర్ కె.రాజేందర్, జేఎన్‌టీయూ ఫార్మాస్యూటికల్ హెడ్ ప్రొఫెసర్ శోభారాణి, అసిస్టెంట్ డైరెక్టర్ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ జి.రాజ్యలక్ష్మి, కేయూ ప్రొఫెసర్ డీన్ జి.సమ్మయ్య, మెడికేర్ ఆస్పత్రి డైరెక్టర్ జి.చిన్నప్పరెడ్డి, ఫార్మసీ ప్రిన్సిపాల్ జె.వెంకటేశ్వర్ రావు హాజరై డైరెక్టర్ డాక్టర్ తాళ్ల వంశీ, చైర్మన్ తాళ్ల మల్లేశంతోకలిసి జ్యోతి ప్రజ్వలన చేసి వేడుకలను ప్రారంభించారు. కార్యక్రమంలో తాళ్ల వైష్ణవి, డాక్టర్లు పుష్టి, సురేందర్, బేతి శ్రీనివాస్, రమ్యకృష్ణ, జ్యోత్స్న, మాధవి, అధ్యాపకులు పాల్గొన్నారు.

'కొరత ఉందని కేంద్రమంత్రే చెప్పారు'

హసన్‌పర్తి: రాష్ట్రంలో యూరియా కొరత ఉందని స్వయంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి చెబుతున్నారని పీఏసీఎస్ చైర్మన్ బిల్లా ఉదయ్‌కుమార్ రెడ్డి అన్నారు. హసన్‌పర్తి మండల కేంద్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో పెగడపల్లి పీఏసీఎస్ చైర్మన్ గోపాల్‌రెడ్డి, వంగపహాడ్ పీఏసీఎస్ చైర్మన్ మేర్గు రాజేష్‌తో కలిసి శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఉదయ్‌కుమార్ రెడ్డి మాట్లాడారు. గతంలో కంటే ఈసారి అదనంగా 25లక్షల సాగుభూమి పెరిగిందన్నారు. ఒప్పందం ప్రకారం కేంద్రం 8.3లక్షల మెట్రిక్ టన్నుల యూరియాను దిగుమతి చేయాల్సి ఉండగా, ఇప్పటివరకు 5.32లక్షలు మెట్రిక్ టన్నులు మాత్రమే విడుదల చేసిందని చెప్పారు. దీంతో రాష్ట్రంలో కొంతమేర యూరియా కొరత ఏర్పడిందని వివరించారు. రాజకీయ ప్రయోజనాల కోసమే రైతులను మాజీ మంత్రి దయాకర్‌రావు రెచ్చగొడుతున్నారని విమర్శించారు. సమావేశంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు మహేందర్‌రెడ్డి, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ తంగళ్లపల్లి కుమారస్వామి, మాజీ సర్పంచ్ మదన్, పూల, స్వాతి, జీవన్ రెడ్డి, శ్రీరాములు, దేవస్థాన చైర్మన్ వెంకటస్వామి పాల్గొన్నారు.


మాట్లాడుతున్న పీఏసీఎస్ చైర్మన్లు

సంక్షిప్తంగా

సీపీఎస్ రద్దు చేయాలని నిరసన

విద్యారణ్యపురి: సీపీఎస్‌ను రద్దుచేసి పాత పింఛన్ విధానాన్ని పునరుద్ధరించాలని హనుమకొండ ప్రభుత్వ జూనియర్ కళాశాల అధ్యాపకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కళాశాల వద్ద నల్లబ్యాడ్జీలతో శనివారం నిరసన తెలిపారు. కార్యక్రమంలో అధ్యాపకులు రాజ్‌కుమార్, రాజేశ్వర్ కుమార్, రాజేష్, సాంబ శివయ్య, విజయ్‌చందర్, దయాకర్, సురేష్‌బాబు, శోభ, రేవతి, సరిత, సువర్ణ పాల్గొన్నారు.

క్రీడలతో నైపుణ్యాల పెంపు

హసన్‌పర్తి: క్రీడలతో నైపుణ్యాలు పెంపొందుతాయని కిట్స్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అశోక్‌రెడ్డి అన్నారు. కిట్స్ కళాశాల ఇండోర్ స్టేడియంలో రెండు రోజుల పాటు నిర్వహించనున్న ఉమ్మడి జిల్లా స్థాయి టేబుల్ టెన్నిస్ పోటీలు శనివారం ప్రారంభమయ్యాయి. టేబుల్ టెన్నిస్ జిల్లా అధ్యక్షుడు ఆకారపు హరీష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో కిట్స్ కళాశాల ఏఓ డాక్టర్ రమేష్‌రెడ్డి, డబ్ల్యూడీటీటీఏ ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌రెడ్డి, ఉపాధ్యక్షులు జైసింగ్, కె.సునీల్‌కుమార్, కార్యనిర్వాహక సభ్యులు రవికుమార్, వెంకటస్వామి, మహేష్, రిటైర్డ్ పీడీ మోహన్‌రావు, డాక్టర్ ప్రభాకరాచారి పాల్గొన్నారు.

శాస్త్రవేత్తలు ఒకప్పటి విద్యార్థులే

హన్మకొండ: అంతరిక్షం అనేది అనంతమైన జ్ఞాన సముద్రమని, తమ దేశం ఇప్పటికే చంద్రయాన్, మార్స్ మిషన్ వంటి అద్భుత విజయాలు సాధించిందని, ఈ విజయాల వెనుక శ్రమించిన ఇప్పటి శాస్త్రవేత్తలు ఒకప్పటి విద్యార్థులేనని పూర్వ ఇస్రో కన్సల్‌టెంట్, శాస్త్రవేత్త ఆర్‌హెచ్‌బీ.రామ్మూర్తి అన్నారు. హనుమకొండ సుబేదారిలోని రామన్ స్కూల్‌లో జాతీయ అంతరిక్ష దినోత్సవాన్ని శనివారం జరుపుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి విద్యార్థి శాస్త్రవేత్తగా, ఆవిష్కర్తగా ఎదిగే అవకాశాలున్నాయని చెప్పారు. శ్రద్ధ, క్రమశిక్షణ, విజ్ఞాన పిపాస, కలల పట్ల నమ్మకంతో ముందుకు సాగాలని సూచించారు. సమావేశంలో పాఠశాల కరస్పాండెంట్ రాజేష్ కుమార్, డైరెక్టర్ పురుషోత్తం, ప్రిన్సిపాల్ స్రవంతి, వైస్ ప్రిన్సిపాల్ చంద్రప్రకాశ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిశోధన సామర్థ్యాలు పెంచుకోవాలి

హన్మకొండ: అధ్యాపకులు, విద్యార్థులు పరిశోధన సామర్థ్యాలను పెంచుకోవాలని న్యూ హైట్ ఫార్మా టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ వి.వెంకటేశ్వర్లు అన్నారు. హనుమకొండ నయీంనగర్‌లోని వాగ్దేవి డిగ్రీ, పీజీ కళాశాలలో వాగ్దేవి విద్యాసంస్థల ఆధ్వర్యంలో విశ్వంభర ఎడ్యుకేషనల్ సొసైటీ స్పాన్సర్‌షిప్‌లో రీసెర్చ్ గ్రాంట్ రైటింగ్ పబ్లికేషన్ స్ట్రాటజీస్ సొసైటీ, కన్సల్‌టెన్సీ ప్రాజెక్ట్స్, అన్‌లాకింగ్ ది రీసెర్చ్ పొటెన్షియల్ అనే అంశంపై ఒకరోజు సదస్సు శనివారం జరిగింది. ఈ సందర్భంగా వాగ్దేవి కళాశాల జర్నల్స్‌ను అతిథులు ఆవిష్కరించారు. సదస్సులో యూరో డ్రగ్స్ లాబరేటరీస్ కంట్రీ హెడ్ డాక్టర్ ప్రభాశంకర్, కళాశాల రీసెర్చ్ డైరెక్టర్ డాక్టర్ శిరీష, ప్రిన్సిపాళ్లు కె.శ్రీనివాస్ రెడ్డి, జి.కమల్ యాదవ్, ఎస్.వాసుదేవమూర్తి, అనిల్ కుమార్, ఎం.స్వప్న రెడ్డి పాల్గొన్నారు.

అన్నపూర్ణ దేవికి బోనాల సమర్పణ

కాజీపేట: గణపతి బ్రహ్మోత్సవాల వేడుకలను పురస్కరించుకుని స్వయంభూ శ్వేతార్క మూలగణపతి దివ్యక్షేత్రంలో స్వామి వారికి భక్తులు బోనాలతో నైవేద్యం సమర్పించారు. ఉత్సవాల్లో భాగంగా మూడో రోజు శనివారం మహిళలు బోనంతో ఆలయ మాడ వీధుల చుట్టూ ప్రదక్షిణలు చేశారు.

వాహనాల చట్టాన్ని రద్దు చేయాలి

- ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి


సమావేశంలో మాట్లాడుతున్న రామస్వామి

వరంగల్ చౌరస్తా: తెలంగాణ ఆటో, ట్రాలీ మోటారు వాహనాల చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని ఏఐటీయూసీ వరంగల్ జిల్లా ప్రధాన కార్యదర్శి ముక్కెర రామస్వామి డిమాండ్ చేశారు. వరంగల్ చార్‌బౌలిలోని ఓ ఫంక్షన్ హాల్‌లో నాయకులు ఎండి.మహబూబ్ పాషా, మదర్, సలాం అధ్యక్షతన ఏఐటీయూసీ మొదటి సమావేశం శనివారం జరిగింది. ఈ సందర్భంగా రామస్వామి మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 25 లక్షల వరకు రవాణా రంగంలో ప్రధానంగా ఆటో ట్రాలీ, టాక్సీ, గూడ్స్, స్కూల్ బస్సులు వంటి వాహనాల్లో కార్మికులు పనిచేస్తున్నారని చెప్పారు. వారంతా ఉన్నత చదువులు చదువుకొని ఉద్యోగం రాక స్వయం ఉపాధితో బతుకుతున్నారని తెలిపారు. ఉమ్మడి వరంగల్ వ్యాప్తంగా సుమారు 40 వేల మంది ఆటోలు నడుపుతున్నారని వివరించారు. అనంతరం 33మందితో కూడిన నూతన కమిటీ ఎన్నుకున్నారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్షుడు సుంచు జగదీశ్వర్, రాష్ట్ర గౌరవ అధ్యక్షుడు నర్ర ప్రతాప్, రైతు సంఘం జిల్లా కార్యదర్శి పెద్దాపురం రమేష్, ఏఐసీటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు సాగర్, నాయకులు పాల్గొన్నారు.

ఫీజు రీయింబర్స్‌మెంట్ చెల్లించాలి


దీక్షలకు సంఘీభావం తెలుపుతున్న సుందర్‌రాజ్

కేయూ క్యాంపస్: పెండింగ్‌లో ఉన్న స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్‌ను విడుదల చేయాలని కుడా మాజీ చైర్మన్ సుందర్‌రాజ్ యాదవ్ డిమాండ్ చేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో హనుమకొండలోని యూనివర్సిటీ ఆర్ట్స్ అండ్ సైన్స్ కళాశాల ఎదుట శనివారం దీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో 8,158 కోట్ల స్కాలర్‌షిప్‌లు, ఫీజు రీయింబర్స్‌మెంట్ పెండింగ్‌లో ఉన్నట్లు తెలిపారు. దీక్షలో ఎస్ఎఫ్ఐ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు స్టాలిన్, జనరల్ సెక్రటరీ మంద శ్రీకాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు కళ్యాణ్, జిల్లా సహాయ కార్యదర్శి బిరెడ్డి జస్వంత్, బాధ్యులు ప్రశాంత్, ఈశ్వర్, ఇస్మాయిల్, పవన్‌కుమార్, రాకేష్ రెడ్డి, అరుణ్‌కుమార్, పవన్‌కుమార్, ప్రదీప్, కృష్ణ సందీప్‌కుమార్, రాహుల్, సాయి పాల్గొన్నారు. కాగా, దీక్షల శిబిరం నుంచి సుందర్‌రాజ్ యాదవ్‌ను, ఎస్ఎఫ్ఐ నాయకులను పోలీసులు అరెస్ట్ చేసి అనంతరం వదిలేశారు.

ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలి

వరంగల్ స్పోర్ట్స్: హాకీ క్రీడా దిగ్గజం మేజర్ ధ్యాన్‌చంద్ స్ఫూర్తితో క్రీడల్లో రాణించాలని హనుమకొండ డీవైఎస్ఓ గుగులోతు అశోక్‌కుమార్ అన్నారు. ధ్యాన్‌చంద్ జయంతిని పురస్కరించుకుని హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పోటీలను శనివారం నిర్వహించారు. పదేళ్లలోపు పిల్లలకు రన్నింగ్, మ్యూజికల్ చైర్, బేబీ క్రాలింగ్, క్రికెట్ పోటీలు నిర్వహించారు.


మాట్లాడుతున్న అశోక్‌కుమార్

ఈశా గ్రామోత్సవ పోటీలు ప్రారంభం

ఈశా ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని జవహర్‌లాల్ నెహ్రూ స్టేడియంలో క్రీడా పోటీలను శనివారం నిర్వహించారు. గ్రామోత్సవ వేడుకలకు ముఖ్యఅతిథిగా హనుమకొండ జిల్లా యువజన, క్రీడల అధికారి గుగులోతు అశోక్‌కుమార్ పాల్గొని పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ క్రీడాకారులకు తనవంతు సహకారం అందిస్తామని అన్నారు. రెండు రోజుల పాటు జరగనున్న పోటీల్లో పురుషుల వాలీబాల్ 21 జట్లు, మహిళల త్రోబాల్ పోటీల్లో 12 జట్లు పాల్గొన్నాయని ఈశా వలంటీర్ తెలిపారు. సెప్టెంబర్ 21న కోయంబత్తూర్ లోని ఈశా యోగా సెంటర్‌లో జరగనున్న ఆదియోగి వద్ద విజేతలకు ట్రోఫీ, రూ.5 లక్షల నగదు పురస్కారం అందజేయనున్నట్లు ఆయన వివరించారు.

చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి

- 'సఖి' హనుమకొండ అడ్మిన్ హైమావతి

విద్యారణ్యపురి: చట్టాలపై ప్రతిఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని సఖి హనుమకొండ అడ్మిన్ హైమావతి సూచించారు. సఖి సెంటర్ ఆధ్వర్యంలో హనుమకొండ ప్రభుత్వ డైట్ కళాశాలలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆమె మాట్లాడారు. మహిళా అభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, సర్వోదయ యూత్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో సఖి కేంద్రం ఐదు రకాల సేవలు అందిస్తోందని అన్నారు. బాధిత మహిళలకు ఉచిత కౌన్సెలింగ్, న్యాయం, పోలీస్, వైద్య సాయం, తాత్కాలిక వసతి అందిస్నట్లు వివరించారు. అనంతరం సఖి సేవల వాల్‌పోస్టర్లను ఆవిష్కరించారు. సదస్సులో సఖి సెంటర్ కేస్ వర్కర్ అనూష, తదితరులు పాల్గొన్నారు.


వాల్‌పోస్టర్లను ఆవిష్కరిస్తున్న హైమావతి, తదితరులు

అంగన్‌వాడీ కేంద్రంలో ఆటల పోటీలు

న్యూశాయంపేట / వరంగల్ చౌరస్తా: జాతీయ క్రీడల దినోత్సవాన్ని పురస్కరించుకుని 14వ డివిజన్ పరిధిలోని సుందరయ్య నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో ఉమెన్ చైల్డ్ వెల్ఫేర్ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో చిన్నారులకు శనివారం ఆటల పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా డీడబ్ల్యూఓ రాజమణి మాట్లాడుతూ ఆటల ద్వారా పిల్లల్లో శారీరక, మానసిక ఎదుగుదలతో పాటు స్నేహ సంబంధాలు మెరుగుపడతాయని అన్నారు. కార్పొరేటర్ తూర్పాటి సులోచన, సీడీపీఓ విద్య, డీఎస్ఓ సత్యవాణి, సూపర్‌వైజర్ జక్కుల లావణ్య, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో అన్నదానం

హన్మకొండ కల్చరల్: అమృత హస్తం సంస్థ ఆధ్వర్యంలో హనుమకొండ వేయిస్తంభాల దేవాలయం ఎదుట శనివారం మధ్యాహ్నం అన్నదానం చేశారు. తెలంగాణ అర్చక ఉద్యోగ జేఏసీ చైర్మన్ గంగు ఉపేంద్రశర్మ పాల్గొని అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు ఎనుములపల్లి ఉమాదేవి - శ్రీనివాస్, వాసం కరుణ, వెనిశెట్టి కనకలక్ష్మి, బిక్కి దివ్య, అయితు జ్యోతి, గార్లపాటి ప్రసన్నలక్ష్మి, విశాలి, వీణ, బొల్లేటి కృష్ణమాచారి, ఎల్లారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధురాలిని కాపాడిన పోలీసులు

మడికొండ: 70 ఏళ్ల వృద్ధురాలు కాజీపేట మండలం అయోధ్యపురం రైల్వేగేట్ వద్ద శనివారం ఆత్మహత్యకు యత్నించింది. ఈ క్రమంలో బ్లూకోర్ట్స్ కానిస్టేబుళ్లు గోవర్ధన్, నవీద్ అలీ.. రైల్వే గేట్ సిబ్బంది సహకారంతో ఆ వృద్ధురాలు ప్రాణాలను కాపాడారు. అనంతరం ఆమెను కుటుంబ సభ్యులకు అప్పగించారు. వృద్ధురాలిని కాపాడిన పోలీసులను స్థానికులు అభినందించారు.

సురవరం మృతి పార్టీకి తీరనిలోటు


కుమార్‌పల్లిలో నివాళులర్పిస్తున్న నాయకులు

సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శిగా పనిచేసిన ఉద్యమకారుడు సురవరం సుధాకర్‌రెడ్డి మృతి పార్టీకి తీరనిలోటని పార్టీ నాయకులు కొనియాడారు. నగర వ్యాప్తంగా పలు డివిజన్లలో సుధాకర్ రెడ్డి చిత్రపటాలకు పూలమాలలు వేసి శనివారం ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ విద్యార్థి దశ నుంచే సురవరం ఉద్యమాల బాట పట్టారని, ఏఐఎస్ఎఫ్, ఏఐవైఎఫ్ జాతీయ ప్రధాన కార్యదర్శిగా అనేక సమస్యలపై పోరాడారని గుర్తుచేశారు.

\- సాక్షి నెట్‌వర్క్